బతుకమ్మ చీరల పంపిణీ

ఫిలింనగర్‌లో బతుకమ్మ చీరలను పంపిణీచేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్/ ఖైరతాబాద్/ హిమా యత్‌నగర్, అక్టోబర్ 7: తెలంగాణ సంస్కృతికి మారుపేరుగా నిలుస్తున్న బతుకమ్మ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జీహెచ్‌ఎంసీ సర్కిల్ -18 పరిధిలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్ బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను ప్రభుత్వం హుయాంలో ఘనంగా నిర్వహిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పండగ ఆనందాన్ని చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ పంచాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ గత తొమ్మిదేండ్లుగా బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ విభాగం అధికారిణి లలిత కుమారి, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి నర్సింగరావు, పద్మ, మహేశ్వరి, మారెమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ జవహర్‌నగర్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

హిమాయత్‌నగర్‌లో.. ఆడపడుచుల ఆత్మగౌరవం పెంపొందించేందుకు ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తుందని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ అన్నారు. శనివారం విఠల్‌వాడీలోని వార్డు కార్యాలయంలో మహిళలకు ఆమె బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో రజిత, బీజేపీ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో.. సోమాజిగూడ డివిజన్ బీఎస్ మక్తా లైబ్రరీ వద్ద ఆడపడుచులకు కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

విఠల్‌వాడీలోని వార్డు కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్

బీఎస్ మక్తా లైబ్రరీ వద్ద ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వనం సంగీతయాదవ్

మాజీ ఐఏఎస్ అధికారి సేవలు మరువలేనివి

హిమాయత్‌నగర్,అక్టోబర్7: దళిత బహుజనుల హక్కుల కోసం మాజీ ఐఏఎస్ అధికారి కీర్తిశేషులు శంకరన్ అందించిన సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యు డు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శంకరన్ వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్‌లో శంకరన్ చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోస శంకరన్ తుది శ్వాస వరకు కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలని కోరారు. శంకరన్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్,నాయకులు రాజుకుమార్, ఆర్.అంజయ్య నాయక్, సహదేవ్, నరేందర్, జంగయ్య, అశోక్ పాల్గొన్నారు.

గాంధీ పురస్కారాలు ప్రదానం..

పురస్కారాలను అందజేస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

ముషీరాబాద్, అక్టోబర్ 7: శ్రీకమలాకర మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రలువురు ప్రముఖులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ ఎ.రామలింగేశ్వరారావు ముఖ్య అతిథిగా పాల్గొని తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు జీవీ భూదాన్ సుబ్బారావు, పామర్తి పద్మావతిలకు మహాత్మాగాంధీ స్మారక జీవిత సాఫల్య, కస్తూరిబా స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య టి. గౌరీశంకర్, గోదాటి రంగారావు, శ్రీకమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతీ కమలాకర్, జి. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణలో భాగస్వాములమవుతాం

సంఘం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు తదితరులు

ఖైరతాబాద్, అక్టోబర్ 7 : ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో తామూ భాగస్వాములమవుతామని తెలంగాణ స్టేట్ డాక్టర్స్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు శ్రీనివాసులు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువచ్చే విప్లవాత్మకమైన మార్పులకు సలహాలు, సూచనలు అందించే తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు ఈ ఏడాది మొట్టమొదటి సారిగా త్వరలోనే ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో తమ ఫోరం తరపున 13 మందితో ప్యానల్‌గా ఏర్పడిన సభ్యులు పోటీ చేస్తున్నారని తెలిపారు. వయో వృద్ధులైన వైద్యులకు ఉచితంగా రెనివల్, మెడికల్ కౌన్సిల్‌కు నూతన భవన నిర్మాణం, ఆరోగ్య సమస్యలపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు తదితర అజెండాలతో ఈ ఎన్నికల్లో తమ ఫోరం పోటీ చేస్తుందన్నారు. 48,405 మంది వైద్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న తమ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఫోరం ప్రతినిధులు చీమ శ్రీనివాస్, గొంగూర వెంకటేశ్వర్లు, లింగం గౌడ్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

నర్సులకు అరుదైన గౌరవం..

ఖైరతాబాద్, అక్టోబర్7: స్టాఫ్ నర్సులను నర్సింగ్ ఆఫీసర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం నర్సులు అందిస్తున్న సేవలకు అరుదైన గౌరవమని టీఎన్‌ఓ కేంద్ర సంఘం ప్రచార కార్యదర్శి, ఖైరతాబాద్ కమ్యునిటీ హెల్త్ సెంటర్ నర్సింగ్ ఆఫీసర్ టి. శైలజ జగన్నాథం అన్నారు. సిద్దిపేటలో వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించడంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు ఆమె ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను, వైద్యాన్ని సామాన్యుడికి సైతం అందేవిధంగా కృషిచేస్తూ వైద్యరంగంలో సరికొత్త విప్లవాన్ని సృష్టించిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కలలుగన్న ఆరోగ్య తెలంగాణ కోసం తమవంతుగా ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని ఆమె వివరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం అవిరాళంగా కృషి చేస్తున్న టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్‌కు ఆమె ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

వాడి రైల్లో వృద్ధుడు మృతి

కాచిగూడ, అక్టోబర్ 7: వాడి రైల్లో వృద్ధుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(70) శనివారం ఉదయం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-2లో అగిన వాడి రైల్లోని జనరల్ బోగిలో మృతి చెంది ఉన్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్..

హిమాయత్‌నగర్, అక్టోబర్ 7 : పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసిన ఘటన నారాయణగూడ పరిధిలో జరిగింది. ఎస్సై షఫీ తెలిపిన వివరాల ప్రకారం.. విట్టలవాడలోని జీవకళ మందిర్ అపార్ట్‌మెంట్‌లో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ.87 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తుదిదశకు గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక

- తొలివిడత 1000మందికి సాయం
- రెండు, మూడురోజుల్లో పంపిణీకి ఏర్పాట్లు

బంజారాహిల్స్,అక్టోబర్ 7: సొంతింటి స్థలం కలిగి ఉంటి ఇల్లు కట్టుకునే స్థోమత లేని పేదల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తుదిదశకు చేరుకున్నది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో సుమారు 2,500కి పైగా గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలోని పలు స్లమ్స్‌లో నివాసం ఉంటున్న పేదలు గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. నియోజకవర్గంలో తొలివిడతగా సుమారు 1,000మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారని తెలుస్తోంది. దరఖాస్తుదారుల ఆర్థిక స్థితిగతులను పరిశీలించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆమోదం తర్వాత తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే సంబంధితశాఖ అధికారులు తమకు అందిన దరఖాస్తులను స్క్రీనింగ్ చేశారు. గృహలక్ష్మి మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించారు. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉండడంతో రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించనున్నామని ఎమ్మెల్యే నాగేందర్ తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు

హిమాయత్‌నగర్, అక్టోబర్7: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ వరకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు వివిధ అంశాలపై సదస్సులు, శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శారీరక వ్యాయామాలు, యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయడంతో పాటు సైకాలజిస్ట్‌లను సంప్రదించి జీవన శైలిలో మార్పు చేసు కోవాలని సూచించారు.

రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి, చిత్రంలో నాగిరెడ్డి తదితరులు

ఖైరతాబాద్, అక్టోబర్ 7 : పేద రెడ్ల సంక్షేమం కోసం ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి ఐక్య వదేఇక నాయకులు డి. శంకర్‌రెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రకులంగా ఉన్నా అనేక మంది పేదరికం అనుభవిస్తున్నారని, డ్రైవర్లు, వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా జీవితాలను సాగిస్తున్నారన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయిస్తే వారికి అనేక రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐక్య వేదిక నాయకులు నాగిరెడ్డి, మోహన్ రెడ్డి, ప్రబాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిండి శతకము ఆవిష్కరణ

తిండి శతకాన్ని ఆవిష్కరించిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

ముషీరాబాద్, అక్టోబర్ 7: కల్యాణి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రముఖ కవి నోరి రఘురామమూర్తి రచించిన తిండి శతకము పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఓయూ పూర్వ తెలుగు శాఖ అధిపతి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కవి నలవోలు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథ స్వీకర్త డాక్టర్ నల్ల కరుణాకర్‌రెడ్డి, కవి గంటా మనోహర్ రెడ్డి, విడి రాజగోపాల్, రాధాకుసుమ, గోపాల్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం, సినీ సంగీత విభావరి పలువురినీ అలరించింది. గాయనీగాయకులు రఘురామమూర్తి, హేమకల్యాణి, సాయికుమార్, వల్లీకుమారి ఆలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి.